# ఆడాళ్ళని పెంచకూడదు

అప్పుడే కోళ్ళుకూసినవి. గ్రామాంతరములకు బోవుటకు రైలునకు వెళ్ళవలసిన వారందఱును కళ్ళు నులుముకొనుచు బయలుదేరిరి. అక్కడక్కడ గృహిణులు చల్ల చేయుటకు ప్రారంభించిరి. ప్రబంధకవుల వర్ణనల కెక్కు విషయములు గూడ అనేకములు జరుగుచుండెను.

ఈ సమయమున రాయవరమున ఒక యింట, నొక గదిలో కుర్చీపీటమీద నొక యువకుడును ఆతని యొడిలోనొక యువతియు కూర్చుండి యుండిరి. ఇరువురును ఒకరి భుజముల మీద నొకరు చేతులు వేసుకొనియుండిరి.

"తొరగా రావాలి యీమాటు. ఆలస్యమయితే నేను వుండలేను"

"ఇంటికి రాగానే వస్తాను"

"వెళ్ళిరండి"

"ఏమి వెళ్ళి రావడమూ? నీకేమీ తేవడానికి వీల్లేదు గదా?"

"తేవడం యెందుకు లెండి. ఇంతకీ నా కర్మం యిలా వుంది. యెంత కోరిక వున్నా దిగమింగుకోవలసి వచ్చింది."

"నీలం తొందరపడకు. కొద్దిరోజుల్లోనే నిన్ను నా యింటికి తీసుకుపోతాను."

"అంత భాగ్యమా నాకు?"

"చూస్తూ వుండు."

ఇట్లు చెప్పి యాతడు లేచెను. ఒకరినొకరు పొదివి పట్టుకొని యిరువురును ద్వారము వఱకును వెళ్ళిరి. యువతి మెల్లగనే తలుపు తెఱచెను; గాని దురదృష్ట వశమున చప్పుడయ్యెను. అందులకు ఆమె కించపడుచుండగా "ఎవరు తలుపు తీసినవారు?" అని మేడమీది నుండి కేకవచ్చెను. వెంటనే "యింకా నిమ్మళంగా అడుగుతారేం? రండి చూద్దాము. దొంగ దొరుకుతాడు. అమ్మాయి గుణం తెలుస్తుంద"ని మఱియొక మాట వినబడియెను. ఇది విని "జాగ్రత్త" అని యువకుడు ఉడాయించెను. యువతి భయభ్రాంతయై తలుపు మూసి మఱలపోయి మంచము మీద పరుండెను.

"తియ్యి తలుపు" అని మండువా దెసనుండి ఒక స్త్రీ గద్దించి తలుపు గుంజెను. యువతి మఱింత భయపడి యూరకుండగా వెలుపల గద్దింపులును, దూషణములు మెండయ్యెను. చేయునది లేక ఆమె తలుపు దీయగా నలువది యేండ్ల స్త్రీ యొకతె రభసముతో లోపలకు వచ్చి "రంకు మొగుణ్ణి యేంచేశావో చెప్పు" అని తర్జనభర్జన ప్రారంభించెను.

నీలమ్మకు ఏడ్పు వచ్చినది. కన్నుల నీళ్ళు గిరగిర తిరిగిపోయినవి. శరీరము గడగడ వడకిపోవుచున్నది. నోట మాట రాలేదు.

స్త్రీ గద్దింపులు అంతకంతకు పెరుగుచుండగా నీలమ్మ "నన్ను బతకనీయవా యేమిటి?" అని యేడ్చుచు క్రిందగూలబడెను.

ఇంతలో యేబది యేండ్ల పురుషుడొకడు వచ్చెను. అతనిని జూచి నీలమ్మ "నాన్నా, నన్ను బతకనిచ్చే పట్టుపట్టలేదీ పాడుముండ! చంపేస్తూంది. అనరాని మాటలని నా కొంప తీస్తోంది."

"నోరు సరిగ్గా సద్దుకో. పాడుముండనా నేను? ఏమయ్యా, ఆ వరసగా నన్ను తిడుతూ వుంటే అలా చూస్తూ వింటూ వూరుకుంటావు?"

"ఏమిటి అమ్మాయీ! దురుసుతనం చూపిస్తావూ? అదేమిటో అడుగుతోంది చెప్పు సమాధానం."

"ఏముంది నాన్నా!"

"రంకు మొగుణ్ణి యెక్కడ దాచేవూ?"

"చూశావా నాన్నా ఆ కూతలు?"

"తలుపు చప్పుడెందు కయింది?"

"ఏమో నాన్నా; ఎవరి తలుపో"

"ఇంకా బొంకడం కూడానా? అవును. రంకు నేర్చినదానవు బొంకవూ? విన్నారా అమ్మాయి మాటలు?"

"నీకీ దుర్బుద్ధి యెప్పటినుంచీ పుట్టిందే అమ్మాయి?"

"వీలయి మాటలు కలిసినప్పటి నుంచీని. గుడ్డి వాళ్ళని చేసేసి మనల్ని ఆడుతోంది ఆట."

"విన్నావా నాన్నా ఆ మాటలు?"

"తలుపు చప్పుడెందు కయిందో చెప్ప మంటే మాట్లాడవేమీ?"

"నాకేం తెలుసును నాన్నా?"

"చూశారా యింకా యెలా బొంకుతోందో?"

"ఏమమ్మాయీ నా మర్యాద తక్కనియ్యవూ?"

"నీకూ అలాగే తోస్తోందా నాన్నా?"

"తోస్తోందా యేమిటి? అడిగిన దానికి సరిగా జవాబు చెప్పవేం?"

"చెబుతుందీ? చూడండీ నోరూ. ఏదీ నోరు విప్పూ చూశారా తమలపాకుల గారా? ఇంట్లో తమలపాకులు లేవు గదా నీనోరు ఎందులకు ఎర్రపడిందీ?"

"అయ్యో, నా కర్మం కాలిపోతే యిదోటా?"

"నోరెందుకు యెర్రపడిందే అమ్మాయీ!"

"నోరు పూస్తే తులిశాకులూ కవిరీ నవిలేను నాన్నా తగ్గడానికి. నేనేం కర్మం యెరుగను. నన్ను రక్షించు నాన్నా"

"కర్మానికేం వచ్చిందీ నీకు. హాయిగా సుఖపడేటప్పుడూ? తెలిసిందా అమ్మాయి స్వభావం?"

"ఇదిగో చెపుతున్నాను. ఇదివరకెలా జరిగిందో జరిగింది. ఇక యేమేనా యిలాంటి పనులు చేశావంటే మహమ్మాయి వండిస్తాను"

ఇట్లు చెప్పి పురుషుడు స్త్రీని తీసుకొని వెడలిపోయెను. నీలమ్మ ఒడలు తెలియక అట్లే పడియుండెను.

## ②

ఒక సాయంత్రము ఆ యింటి కెదుట అరుగుమీద నొక యువకుడు కోటుజేబులలో చేతులు వుంచుకొని పచారు చేయుచు మెల్లమెల్లగా ఈల వేయుచు తఱుచు కిటికీ దెసకు చూచుచుండెను. ఇట్లు ఒక పదినిముసములు గడచునప్పటికి మేడమీద నుండి ఆ నలుబది యేండ్ల స్త్రీ రుసరుసలాడుచు "ఎందుకయ్యా, కిటికీ కేసి చూస్తూ అలా ఈలలు వేస్తావూ? మంచీ చెడ్డా అక్కర్లేదూ?" అని యడిగెను. యువకునకు కోపము వచ్చినది. కన్నులెఱ్ఱ జేసినాడు.

"నేను ఈల వేసుకుంటే నీకేం?"

"కట్టిపెట్టు నీ వేషాలు. జాగర్త ఏమనుకున్నావో?"

"ఏం చేస్తావేమిటీ?"

"ఈ యిల్లు సంసారులది. తెలుసునా?"

"నువ్వెవరూ?"

స్త్రీకి చాల కోపము వచ్చెను. గందరగోళము ప్రారంభించినది. ఈ యౌద్ధత్యమును జూచి యువకుడు "అప్రతిష్ఠ" అని యనుకొనుచు మెల్లగ జారెను.

సాయంకాలమయినది. చాకలి బట్టలు తెచ్చి "భూలోకమ్మ గారూ" అని పిలువగా ఆమె "మేడమీదికి పట్టుకురా" అని పిలిచెను. "నడిసి నడిసి వచ్చేను. మెట్లెక్కలేనమ్మా" యని విసుగు కొనుచు రజకి పైకిబోయెను.

"చూడూ. నువ్వు నిజం చెబుతావు. చాలా మంచిదానవు. అబ్బే; నేను వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను నిన్ను మడేలూ. వో మాట అడుగుతాను నిజం చెబుతావా?"

"ఎప్పుడేనా అబద్ధం చెప్పేనా తల్లీ?"

"మా నీలమ్మ ముట్టయి యెన్నాళ్ళయిందీ?"

"మొన్ననే గాదుటమ్మా"

"అది తెలుసునులే నాకు. ఈ మధ్య అన్నహితవు తప్పిపోయినది: నిజం చెబుదూ మడేలూ!"

"నాకెందుకమ్మా యిలాంటి గొడవలూ? ఏమోనమ్మా! నన్ను పంపించెయ్యండెల్లిపోతాను."

"నిన్ను పట్టుకున్నానా? యిక వెళ్ళవచ్చు"

ఇట్లు చెప్పి భూలోకమ్మ రజకిని పంపివేసి రుసరుసలాడుచు చరచర క్రిందికి వచ్చి "నీలమ్మా" అని పిలిచెను. "మళ్ళీ కొంపమునిగినట్లుంది" అని యడలుచు నామె మండువాలోకి రాగా "ఇందాక చివుకులవారి పిల్లాడు నీకోసం వచ్చే దెందుకూ" అని యడిగెను. నీలమ్మ నిర్ఘాంతపడి ప్రతివచనము చెప్పలేదు.

"మాట్లాడవేం?"

"చివుకులవారి పిల్లాడెవరూ?"

"అయ్యో, అయ్యో, ఎంత నంగనాచివీ? ఆవేళ రాత్రి – తెల్లారగట్ల దొడ్డితలుపు తీసి పంపేశావు కదూ? ఎరగవూ?"

"ఏమిటా మాటలూ! అవతలికి పో"

"పోతానులే. నీకిప్పుడు అన్నం సయిస్తోందా? పుల్లని వస్తువులేమేనా తెప్పించనా?"

"ఏమ్మాటలవీ? నా యెదటనుంచి అవతలికి పోతావా పోవా?"

"ఇదిగో పోతున్నాను. మీనాన్న రేపు వస్తాడులే. తొందరపడకు"

భూలోకమ్మ వెడలిపోయెను. నీలమ్మ "చచ్చేను. ఈ భూతానికి అప్పుడే యెలా తెలిసిందీ?" అనుకొనుచు లోపలకు పోయి కూలబడెను.

## ③

తెల్లవారినది. దాసి వచ్చి "అంట్లెయ్యండమ్మా" అని పదిసారులు పిలిచినను ఎవరును పలుకలేదు. అది మఱలమఱల అదే పనిగా పిలిచి మేడ మీదికి పోగా భూలోకమ్మ అప్పుడే మేల్కొని "యెందుకూ కేకలేస్తావూ?" అనియెను.

"నీలమ్మగారు పలకడం లేదు."

"ఏమయిందీ?"

"ఇంకా నేవనేదు కావాల"

"లేపు"

"మీరు దిగిరండి."

భూలోకమ్మ వచ్చి పిలిచి వెదకగా నీలమ్మ కనబడలేదు. మనస్సు చెదిరిపోయినది. కంగారు పుట్టినది. ఇల్లంతయు వెదకినది. నూయి చూచినది. తోచలేదు. నీలమ్మ గది చూడగా పెట్టె కనపడలేదు. "లేచిపోయింది భామ" అని ఊర్ధ్వ శ్వాసముతో ఆమె యివ్వలకు వచ్చెను.

అప్పుడే వీధిలోనుండి పూర్వపరిచిత వృద్ధుడు లోపలకు వచ్చెను.

"అమ్మాయి లేచిపోయిందండోయి"

"ఎవరితోటీ?"

"రంకు మొగుడుతోటి"

"ఎవరు వాడు?"

"చివుకుల వారబ్బాయి."

"యెలా తెలిసిందీ వాడనీ?"

భూలోకమ్మ జరిగిన దంతయు చెప్పెను. "ఛార్జీ యిచ్చి ౖకైదులో పెట్టించేస్తా వాణ్ణీ దాన్నీ కూడా" అని యాతడు చివాలున లేచెను.

"ముందు కథ యేమిటీ?"

"ఛార్జీ యివ్వడమే. అక్కణ్ణుంచి యిక్కడికి వచ్చి యింత పని చేస్తాడా?"

"దిక్కుమాలిన గొడవ యిదెక్కడ దాపరించింది దేవుడా మాకూ? అయితే నుంచున్న పళంగా వెళ్ళడమే?"

"ఇంకా అడుగుతున్నావా?"

"మరి నాకు వణ్ణం యెలా వస్తుందీ?"

"ఇదో చిక్కా? ఏ వెధవ గుణాలున్నా యింత కాచిపోసీది. ఇక చెయ్యి గాల్చుకోవాలి. యిల్లు కదలడానికి వీల్లేది. వణ్ణం పెట్టి యెక్కడికి వెళ్ళినా మళ్ళీ రాత్రికి చేరుకోవాలి."

"లేకపోతే నేను వండుకోలేను బాబూ"

"ఏడిసినట్లే వుంది. వండుకోలేనని కూచుంటే యెలాగా?"

"మీరో వంటా నేనో వంటా యెందుకండీ?"

"నీవంటలో తినమంటావా యేమిటీ?"

"మీరెలాగా వండుకోవాలి కనక యింకో సోలడు బియ్యం పొంగించలేరూ?"

వీరయ్య రుంజుకొనుచు వంటయింటి లోనికి పోయెను. యిల్లంతయు పరిశుభ్రము గావించి యివ్వలకు వచ్చునప్పటికి తొమ్మిదిగంటల ప్రొద్దెక్కినది. వెంటనే వంటచేసి భోజనానంతర మాతడు ఒక దళారీని వెంటపెట్టుకొని బయలుదేరెను.

## 4

సోమేశ్వరములో నలుగురును చేరిరి. చివుకుల సుబ్బారావు "ఇలాంటి మాటలన్నావంటే బాగా జరగద"నియెను. ఆతని తండ్రి వీరవెంకయ్య కోపపడియెను. పెద్దమనుష్యులు "ఆ పిల్లాడు అలాంటివాడు కాడయా" అనిరి. వీరయ్యకు కోపము వచ్చినది. దళారీ "తొందరపడకండి" అన్నాడు. "నీ

లెక్కేమిటి? నువ్వు వాళ్ళలో కలిసేవు" అని దళారీని విడిచి వీరయ్య రామచంద్రపురము వెడలిపోయెను.

దూర్వాసుల వీరయ్య అంటే రాయవరములో పేచీకి చాలా ప్రసిద్ధి. దావాల నిమిత్తము కోర్టుల కెక్కుట యనిన అతనికి ఎంతో సంబరము. నలువదవ యేట భార్య చచ్చిపోగా నాతడు భూలోకమ్మను తెచ్చిపెట్టుకొనియెను. నీలమ్మ ఒక్కతెయే అతనికి సంతానము. ఆమె నాతడు సోమేశ్వరములో ప్రభల సోమయ్య కుమారుడగు తిరుపతి రాయనికి ఇచ్చి పెండ్లి చేసెను.

అక్కడ సోమయ్య చండశాసనుడు. ఆతని భార్య గూడ అట్టిదే. నీలమ్మ కాపురమునకు వెళ్ళిన తరువాత నాలుగేండ్లు చాల బాధపడియెను. తిరుపతి రాయడు కొన్ని కారణముల వలన తల్లిదండ్రులకు జడిసి ఒదిగియుండెడివాడు. అగుటచే నాతడు భార్యబాధలను తొలగింపజాలకపోయెను.

కొమార్త బాధలను విని సహింపలేక వీరయ్య శ్రావణమాసము పేరు చెప్పి మఱల పంపలేదు. భూలోకమ్మ అప్పుడు నీలమ్మ యెడల చాల ప్రేమతో నుండెను. పైగా ఇల్లరికము రమ్మనగా తిరుపతిరాయడు తిరస్కరించెను. దీనితో అల్లునకును మామకును ముఖావలోకనములుగూడ తప్పిపోయెను. నీలమ్మని తీసికొని రావడానికి వల్లగాదు. దానితో నువ్వు రహస్యంగా మాట్లాడినా నీకూ మాకూ బాగా జరగదు" అని అక్కడ తిరుపతిరాయని తల్లిదండ్రులు ఆజ్ఞ పెట్టిరి. వారిని చెందనాడుకొనినచో ఆతనికి ఏమియు లేదు. అంతయూ సోమయ్య స్వార్జితము.

ఈ తీరున నీలమ్మ కాపురము చెడిపోయినది. కాలక్రమమున ఇక్కడ భూలోకమ్మ గూడ అత్తగారే నయమనిపింప సాగెను. తండ్రి విటకత్తె చేతులలో నుండెను.

కాలము గడుచుచుండగా అక్కడ తిరుపతిరాయని తల్లి చచ్చిపోయెను. సోమయ్య కోరలు పీకిన త్రాచు అయ్యెను. తిరుపతిరాయడు స్వతంత్రుడయ్యెను. "ఇంక పెళ్ళాం మాట చూచుకోరా నాయనా" అని నాయనమ్మ పోరదొడగా ఆ ప్రయత్నములోనే వున్నాన"ని మనుమడు ప్రత్యుత్తరమిచ్చెను.

## 5

వీరయ్య వకీలును పెట్టి రెండువేల రూపాయల నగలతో తన కొమార్తను లేవదీసికొని పోయెనని చివుకుల సుబ్బారావు మీద ఛార్జీ పెట్టెను. పోలీసులు వచ్చి యిల్లు సోదా చూడగా ఏమియు ఆచూకీ దొరకలేదు. "నీకు చేత నయిన పని చేసుకో" అని సుబ్బారావు చెప్పెను. "చూస్తూ వుండు" అని వీరయ్య భగ్నాశుడై వెడలిపోయెను.

వాయిదా వచ్చినది. దాసి, పాలికాపు, ఒకబండివాడు, దళారీ యొకడు – ఈ సాక్షులతో వీరయ్య హాజరయ్యెను. ఉదయము తొమ్మిది గంటలవరకును వకీలు

భీమారావుపంతులు సాక్షులను తయారు చేసెను. మధ్యాహ్నము ఒంటిగంటకు విచారణ ప్రారంభమయ్యెను.

తొలినాటి సాయంత్రము అంట్లు తోముకొని పోవుచుండగా పచారు చేయుచూ ఈలలు వేయుచు ఎదుటి యింటి యరుగు మీద సుబ్బారావు కాన్పించెనని దాసి చెప్పెను.

తెల్లవారుజామున దుక్కిటెద్దులను పొలము తోలుకొని వెళ్ళుటకు వచ్చునప్పటికి వీధిలో బండి నిలిచియుండెననియు, ఎడ్లను విప్పుకొని వచ్చునప్పటికి బండిలే దనియు పాలికాపు చెప్పెను.

దళారీ సుబ్బయ్యను ఎక్కించుకొని తాను మండపేట బండితోలుకొని వెళ్ళుచుండగా మండవారి పాకవద్దకు వెళ్ళునప్పటికి సోమేశ్వరము బండి కలిసెననియు చివుకుల సుబ్బారావుగారే బండిని తోలుచున్నారనియు ఆబండి వారి స్వంతమనియు బండివాడు చెప్పెను.

సుబ్బారావు బండి తోలుచుండగా నీలమ్మ అతనిని ఆనుకొని కూర్చుండి కబుర్లు చెప్పుచున్నదనియు, అనుమానము మీద చుట్టకాల్చుకొనుటకు అని తాను అగ్గిపుల్ల వెలిగించగా ఆ వెలుగున ఆమె ముఖము కాన్పించె ననియు, తోడనే ఆమె ముఖము త్రిప్పుకొనుటయు, సుబ్బారావు బండిని మేఘాలమీద తోలుకొని పోవుటయు జరిగిపోయేనని దళారీ సుబ్బయ్య చెప్పెను. సుబ్బారావు ఎవరినీ అడ్డునవాళ్ళు వేయలేదు.

"కేసు రుజువయింది. ఏం చెబుతావు?" అని మేజిస్ట్రేటు సదర్పముగా నడుగగా భీమారావు పంతులు తన ప్రజ్ఞకు గర్వమును ప్రకటించెను. వీరయ్య "న్యాయం దొరికింది. యిక కఠిన నరకం పడాలి పుండాఖోరుకి" అనుకొనియెను.

సుబ్బారావునకు నవ్వు వచ్చినది. అతడు నిర్లక్ష్యముగా చూచుచు "పంతులుగారు చాలా కష్టపడ్డారే" అనగా భీమారావు పంతులు ఎదురొమ్ము విఱుచుకొని నిలిచి మీసము మెలిపెట్టుచు "నిన్ను శిక్షించడమే నాకష్టానికి ఫలం" అనియెను. "సంకల్ప సిద్ధులు" అని సుబ్బారావు అందులకు బదులు చెప్పి "అయితే నేనిపుడు చేయవలసిన దేమిటండి" అని మేజిస్ట్రేటు నడిగెను.

"నీ నిర్దోషిత్వాన్ని రుజువుపరుచుకోవాలి."

"ఎలాగండి"

"సాక్షులను తెచ్చుకొని"

"ఎలాంటివాళ్ళు కావాలండీ?"

"న్యాయమైనవాళ్ళూ, నమ్మకమైనవాళ్ళూనూ."

"ఆడాళ్ళు పనికి వస్తారాండి?"

"ఆ"

"ఎంతమంది కావాలండీ సాక్షులూ?"

"ఒకరి తరువాత యెంతమంది అయినా సరే వాయిదా యిస్తాను తెచ్చుకో"

"వాయిదా అక్కర్లేదండి. ఇప్పుడే కానీయండి."

"అయితే మరీ మంచిది. సాక్షులను హాజరు పెట్టాలి. నువ్వు వెళ్ళి తీసుకురావడానికి వీల్లేదు. పేర్లు చెప్పు కోర్టువారు పిలిపిస్తారు."

"మొదటి సాక్షి ప్రభల నీలమ్మండి. కేక వేయించండి."

ఈ మాట విని అధికారి అప్రతిభుడయ్యెను. భీమారావు పంతులు తెల్లవోయెను. వీరయ్య నిర్విణ్ణుడయ్యెను. వకీళ్ళందఱును ఆశ్చర్యపడిరి. అక్కడ నున్న యితరులు చకితులైరి.

గుమాస్తా యాజ్ఞ చొప్పున కానిస్టేబులు మూడుమారులు గొంతెత్తి పిలువగా ప్రభల నీలమ్మ వచ్చి బోనులో నిలిచెను.

కోర్టు అంతయు గుసగుసలతో ప్రతిధ్వనించెను. సుబ్బారావు ముఖముమీది మందహాసము ఉచ్చలితమయ్యెను. నీలమ్మ గంభీరముగ నిలువబడియుండెను.

పేరు వయస్సు మున్నగునవి వ్రాసుకొని గుమాస్తా యూరకుండగా భీమారావు పంతులు లేచెను.

"నువ్వు రంకు మొగుడుతో లేచిపోయావు గదూ"

"రామ రామా! సంసార స్త్రీని సంసారి అడగవలసిన మాటే అదీ? అయినా తమకి యెవరు చెప్పేరండి"

"అయితే నువ్వు ఇప్పుడెక్కడ వున్నావూ?"

"ప్రాణేశ్వరుని యింట్లో"

"ప్రాణేశ్వరుడనగా చివుకుల సుబ్బారావు కాదూ?"

"శ్రీహరీ; ఆడుతోడున పుట్టలేదుటయ్యా నువ్వూ? నీకు నావంటి కూతుళ్ళు లేరూ?"

"ఇది మేజిస్ట్రీటు కోర్టు. తెలిసిందా? అడిగిన దానికల్లా సమాధానం చెప్పాలి. పెంకితనం చేస్తే మర్యాద తక్కదు?"

"మానవతులకి మర్యాదభంగం చేసినవాళ్ళకి గూడా మర్యాద తక్కదు గదా?"

"అదేమన్నమాట -?"

"కుడీ, యెడమా యెరగని ప్లీడర్లకీ, సాక్ష్యుల్ని తయారుచేసే ప్లీడర్లకీ శిక్ష అవడానికి రూలు వుందా లేదాండి?"

భీమారావు పంతులు అప్రతిభుడై సాక్షిని మందలించవలసినదని కోరగా అధికారి "అమ్మాయీ, అలా పెంకితనం చెయ్యగూడదు. అడిగిందానికల్లా జవాబు చెప్పాలి" అనియెను.

"ఆడపిల్లని అనరాని మాటలు అనవచ్చునాండి ఆయన?"

"నీమీద అలాంటి కేసు పెట్టాడు మీనాన్న"

"మా నాన్న యేమీ యెరగడండి. వుంచుకున్న ముండా, ఈ ప్లీడరూ చేశారండి యిదంతానూ"

"ఎవరు వుంచుకున్న ముండ?"

"మా నాన్న"

"అంత మంచివాడా మీనాన్న? సరే. నేనడిగీ మాటలికి జవాబు చెప్పు."

"చిత్తం. నేను తమ కూతురులాంటి దాన్నండి. తండ్రి కూతుర్ని అడగవలసినట్లు అడగండి బాబయ్యగారూ?"

"అలాగే అడుగుతాను. నువ్వు ఇప్పుడెక్కడ వున్నావూ?"

"నా పెనిమిటి యింట్లో వున్నానండి"

"ఏమన్నావూ? నిజం చెప్పు."

"నిజంగానేనండి బాబయ్యగారూ! నేనిప్పుడు నా పెనిమిటి దగ్గిరే వున్నానండి"

"ఎన్నాళ్ళనుంచి"

"ఏ క్షణంలో నేను నాతండ్రి యిల్లు విడిచేనో ఆక్షణం మొదలుకొనే వున్నానండి"

"నిన్ను నీతండ్రి యింట్లో నుంచి యెవరు తీసుగు వెళ్ళేరూ? నిజం చెప్పు."

"నిజమేనండి బాబయ్యగారూ. నా పెనిమిటే తీసుగువెళ్ళేరండి."

"బండి యెవరు తోలేరు?"

"బండబ్బేనండి"

"ఎవరా మనిషి?"

"నేనెరగనండి."

"బండి యేవూరుదీ?"

"నాకు తెలవదండి."

"రాత్రి యెన్ని గంటలవేళ వెళ్ళిపోయావూ?"

"వూరు మాటు మడిగింది. రాత్రి పదకొండు దాటుతుందండి."

"అర్ధరాత్రి వేళ యెవరికీ చెప్పకుండా యెందుకు తీసుకువెళ్ళేడూ నీ పెనిమిటీ?"

"తెలిస్తే మానాన్న వెళ్ళనివ్వడండి"

"ఎంచేతా?"

"తనకీ తను వుంచుకున్న ముండకీ వణ్ణం వండి పెట్టేవారు లేకపోతారనీ"

"ఇన్నాళ్ళ దాకా నువ్వు పుట్టింట యెందుకు వుండిపోయావూ?"

"మా అత్తగారు బతికి వున్నప్పుడు నేను అక్కడ వుండలేకపోయాను. తరవాత ఇందాకా చెప్పిన కారణం చేత మానాన్న పంపేడు కాడు. మొన్ననే మా అత్తగారు చచ్చిపోయారు. ఇక నాకు బాధలు లేవు. ఇందాకా చెప్పిన కారణం చేతనే రహస్యంగా వెళ్ళిపోయాను"

"నువ్వు చెప్పిన మాటలు నిజమే కావచ్చును. గాని సాక్ష్యం వుంటేగాని నమ్మడానికి వీల్లేదు; నీ పెనిమిటిని సమను చేసి పిలిపిస్తాము."

"చిత్తం"

"ఏమయ్యా, భీమారావుపంతులుగారూ; ఆపిల్ల అలా చెబుతోంది. మీరు యదార్థంలో అక్రమ ప్రశ్నలే వేశారు. ఇంకేమేనా అడగవలసి వుందా మీకు? సరిగా అడగాలి సుమండీ."

"చిత్తమ"ని భీమారావు పంతులు ఇంకను కొన్ని ప్రశ్నలు మృదువుగ నడిగెను. నీలమ్మ సరిగనే జవాబు చెప్పెను; గాని ఆ జవాబుల వల్ల భీమారావునకు ప్రయోజనము కలుగలేదు. అధికారి సెలవిచ్చి నీలమ్మను పంపివేసి "రెండో సాక్షి యెవరయ్యా?" అని యడుగగా సుబ్బారావు "ప్రభల తిరుపతిరాయడు గారిని పిలిపించండి" అనియెను.

కోర్టు అంతయును "సెబాస్" అని యఱచిరి. భీమారావు ముఖమున కత్తివేసినను నెత్తురు లేకుండ బోయెను. వీరయ్య మీది ప్రాణములు మీదికెగసి పోయెను.

బిళ్ళబంట్రోతు పిలువగా తిరుపతిరాయడు వచ్చి బోనులో నిలిచెను. లాంఛనములన్నియు ముగిసిన తరువాత భీమారావు పంతులు కొనయూపిరితో లేచి నిలచెను.

"నీ భార్యని చివుకుల సుబ్బారావు అనే యువకుడు లేవదీసుకు పోయాడని నీ మామగారు కేసు తెచ్చేరు. నువ్వేం చెబుతావు?"

"వుంచుకున్న ముండ పురి యెక్కించగా ఆయన కోర్టు యెక్కేడు. ఏలినవారు సాక్షులను తయారు చేసారు. ఇదంతా వట్టి అబద్ధం. అబద్ధం కేసు తెచ్చినందుకు మీ కాతాదారు దూర్వాసుల వీరయ్యగారి మీదా, అబద్ధం సాక్ష్యం తయారు చేసినందుకు ఏలినవారిమీదా మర్యాదభంగానికి నా భార్యా, నేనూ కేసులు దాఖలు చేస్తాము. ఇది తమకు సమ్ముఖమునందలి నోటీసూ. మీ జవాబుతో నాకవసరం లేదు. నా భార్యని మీరు అడిగిన ప్రశ్నల ధోరణికి ఇంకో సెక్షను కూడా వేయించబడుతుంది."

భీమారావు నిరుత్తరుడై కూర్చుండెను. ప్లీడరు లందరును "విచారణ యెందుకూ?" అనిరి. లాంఛనములను పూర్తి చేసి అధికారి ఫిర్యాదీని మొగము వాచునట్లు మందలించి కేసు కొట్టి వేసెను.

అంతవఱకును చరచర వ్రాయుచున్న ఒక వకీలు లేచి సుబ్బారావు మీద తప్పుడు ఛార్జీ తెచ్చినందులకు మాన నష్టమునకు కేసు దాఖలు చేసెను. నీలమ్మ పక్షమున, తిరుపతి రాయని పక్షమున మరి యిరువురు ప్లీడరులు గూడ వెంటనే ఛార్జీలు దాఖలు చేసిరి. "యధాశాస్త్రంగా వ్యవహారం నడిపించవోయి" అని అధికారి గుమాస్తాను ఆజ్ఞాపించెను. "ఛూ! ఆడాళ్ళని పెంచకూడదు" అని వీరయ్య వెడలిపోయెను. భీమారావు పంతులు చిన్న బుచ్చుకొని వెడలిపోయెను.

అక్కడ నున్న వారందఱును జయధ్వానములు చేయుచుండ నీలమ్మయు తిరుపతిరాయడును, చివుకుల సుబ్బారావును జట్కా యెక్కి వెడలిపోయిరి.

❀ ❀ ❀